# టైమ్స్ ఆఫ్ వార్త

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలుగు దినపత్రిక


తెలంగాణ | మంగళవారం, 23 - ఏప్రిల్ - 2024 | సంపుటి : 16 | సంచిక : 284 | పేజీలు 07 | వెల : 6/-


## జీవన్ రెడ్డి ఎంపీగా గెలిస్తే

# కేంద్ర వ్యవసాయ మంత్రి ఖాయం

### బాసర సరస్వతి సాక్షిగా ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ

- ఇండియా కూటమి ఏర్పాటులో నిజామాబాద్ పార్లమెంటుకు ప్రాధాన్యం
- నిజామాబాద్, ఆర్మూర్ రైతులంటే ఎంతో అభిమానం
- ఎన్నికల కోడ్ అనంతరం సెప్టెంబర్ 17 లోగా నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభం
- గత ఎంపీలు రైతులను పూర్తిగా మోసం చేశారు
- అందుకే గులాబీ పార్టీని పాతిపెట్టి మొక్క మొలవకుండా కాంక్రీట్ వేశారు
- మోడీ ఇచ్చిన పసుపు బోర్డు పత్రంలో ఏమాత్రం స్పష్టత లేదు
- కాన్వెంట్లో చదువుకున్న అరవింద్ కు రైతుల గురించి తెలియదు.. తండ్రిని అడిగితే తెలుస్తుంది
- ఆనాడు పిసిసిగా, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగడానికి నిజామాబాద్ ప్రాంత రైతుల ఆశీర్వాదమే
- జీవన్ రెడ్డికి వేసే ఓటు నాకు వేసినట్టే
- నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకొని దేశంలో ఇండియా కూటమిని ఏర్పరచుకొని ఆయనను కేంద్ర వ్యవసాయ మంత్రిగా కూర్చోబెడతామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్ రెడ్డిని బలపరుస్తూ నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన్ రెడ్డిని గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలంతా ఆయనను భుజస్కందాలపై పల్లకిలో మోసుకొని పార్లమెంటులో నిలబెట్టేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలస్యమైనప్పటికీ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాణ సమానులైన కార్యకర్తలకు రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2021 జనవరి 31న ఆర్మూర్ లో పసుపు బోర్డు కోసం జరిగిన దీక్షకు హాజరై రైతులకు అండగా నిలిచిన సందర్భాన్ని పురస్కరించుకొని సోనియా గాంధీ ఆయనకు పిసిసి పదవిలో నియమించారన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ ఆర్మూర్ ప్రజలు ఆయనకు అండగా నిలబడతారని నమ్మకం కలిగిందని అప్పటి నుంచి ఈ ప్రాంత ప్రజలంటే తనకు ఎంతో అభిమానం అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాదయాత్ర జరిగిన సందర్భంలో సైతం ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్న సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దీంతో అధికారంలోకి రాగానే బోధనలోని చక్కర కర్మాగారాన్ని పున ప్రారంభించేందుకు మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తో కలిసి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా ఉన్న ఈ ఫ్యాక్టరీని కెసిఆర్ అధికారంలోకి రాగానే మూసి వేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దీన్ని తిరిగి పున ప్రారంభించాలని ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందన్నారు. దీనిపై విధివిధానాల ప్రణాళికకు సంబంధించి మంత్రి శ్రీధర్ బాబు తో జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులను కలిసినారన్నారు. ఇకపోతే ఎన్నికల కోడ్ ముగియగానే వెంటనే సెప్టెంబర్ 17 లోగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఈ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుండా 2004 - 2009 సంవత్సర పదవి కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎంపీ మధు యాష్కి గౌడ్ పార్లమెంట్లో కొట్లాడి సోనియాగాంధీని ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న విజయం, ఘనత మధుయాష్కి కే దక్కుతుందన్నారు. 2014 సంవత్సరంలో ఎంపీగా కవితను గెలిపించుకున్న ఎన్నో

మిగతా 7లో..

## కవిత బెయిల్ పిటిషన్‌పై మే 2న తీర్పు



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బిఆర్ఎస్ ఎంఎల్సి కవిత సిబిఐ బెయిల్ పిటిషన్‌పై ఇరువైపులా వాదనలు ముగిశాయి. మే 2న తుది తీర్పు వెలువడనున్నది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. పిఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు కవిత అర్హురాలు అని ఆమె తరఫు న్యాయవాది వాదించారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారని, ఇడి కస్టడీ లో ఉన్న కవితను సిబిఐ ఎందుకు అరెస్టు చేసిందని ప్రశ్నించారు. అరెస్ట్ చేయాల్సిన అవసరం లేకున్నా, కవితను అరెస్టు చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. బిఆర్ఎస్‌కు కవిత స్టార్ క్యాంపెయినర్ అని కోర్టుకు తెలిపిన ఆమె తరఫు న్యాయవాది, ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదన్నారు. మరోవైపు కవితకు బెయిల్ ఇవ్వొద్దని కోర్టును సిబిఐ కోరింది. కవిత దర్యాప్తును ప్రభావితం చేయగలరన్న సిబిఐ తరఫు న్యాయవాది, లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న రౌస్ అవెన్యూ కోర్టు, తీర్పును రిజర్వ్ చేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం మే 2న తుది ఉత్తర్వులు ఇవ్వనుంది. సిబిఐ కేసులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన వెంటనే, ఇడి కేసులో బెయిల్ పిటిషన్‌పై వాదనలు ప్రారంభమయ్యాయి. కవిత తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, విచారణకు సహకరిస్తున్న కవితను అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదని కోర్టుకు వెల్లడించారు. అరుణ్ రామచంద్రన్ పిళ్లై 10 స్టేట్‌మెంట్‌లు ఇచ్చారని, కవితకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. అనుమానితురాలిగానూ లేని కవితను నిందితురాలిగా మార్చారని, విచారణకు హాజరైన సమయంలో కరడుగట్టిన నేరస్థుల్లా చూశారన్నారు. మార్చి 15న ఆమెను అక్రమంగా అరెస్ట్ చేశారన్న సింఘ్వి, కవిత - కేజ్రీవాల్‌లను కలిపి విచారించడంలో ఇడి విఫలమైందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లో విజయ్ నాయర్ సోషల్ మీడియా వ్యవహారం చూస్తారని, ఆయనతో సోషల్ మీడియా అంశంపై మాత్రమే భేటీ అయినట్లు వివరించారు. బుచ్చిబాబు నాలుగు స్టేట్‌మెంట్‌లు ఇచ్చారన్న కవిత తరఫు న్యాయవాది సింఘ్వి, ఇడికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చాకే ఆయనకు బెయిల్ వచ్చిందని ఆరోపించారు. మాగుంట రాఘవరెడ్డి, బిజెపితో పొత్తులో ఉన్న పార్టీ నుంచి పోటీలో ఉన్నారని, అతను ఎందుకు ఆ పార్టీలో చేరాల్సి వచ్చిందన్నారు. శరత్‌రెడ్డి, బిజెపి ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తి అని ఆరోపించిన కవిత తరఫు న్యాయవాది, వారిచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశారన్నారు. కవిత తన ఫోన్లను కావాలనే ఫార్మాట్ చేసినట్లు ఇడి ఆరోపిస్తుందన్న కవిత తరఫు న్యాయవాది, కవిత ఎవరికీ ఫోన్ ఇచ్చినా ఫార్మాట్ చేసే వాడతారని కోర్టుకు వెల్లడించారు. కవిత వాడిన అన్నీ మొబైల్ ఫోన్లను ఇడికి ఇచ్చామని ఆమె న్యాయవాది సింఘ్వి, మొత్తం 6 ఫోన్లు అందించినట్లు తెలిపారు.

## సమష్టిగా కృషి చేస్తే

# కరీంనగర్ పార్లమెంట్ మనదే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



ప్రజల సమస్యలే ఎజెండాగా పని చేద్దామని.. కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల పట్టణ క్లస్టర్ స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో కేటీఆర్ పాల్గొని, పార్లమెంట్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చాలాస్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తాం అంటున్నారని.. దానిపై ప్రజలు ఆలోచన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. ఐదేళ్లలో ఒక్క పాఠశాల, ఒక్క కళాశాల తీసుకొచ్చాడా ? ఓ గుడి కట్టాడా ? ఒక్క పరిశ్రమనైనా తీసుకువచ్చారా? అంటూ ప్రశ్నించారు. రూపాయి పని చేయని బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మోదీ పదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయన్నారు. తెలంగాణకు ఏమి చేయని బీజేపీకి, కరీంనగర్‌కు నయాపైసా పని చేయని బండి సంజయ్‌కి ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చ పెట్టాలన్నారు. రాష్ట్రంలో 8 నుంచి 10 స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచే ఛాన్స్ ఉందని పలు సర్వే సంస్థలు చెబుతున్నాయన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 10న కేసీఆర్ రోడ్ షో సిరిసిల్లలో ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

## 25 వేల మంది టీచర్ల నియామకాలు రద్దు



**కోల్‌కత:** స్టేట్ లెవల్ సెలెకన్‌టెస్ట్-2016(ఎస్ఎల్ఎస్‌టి) నియామక ప్రక్రియ ద్వారా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలలలో జరిగిన టీచర్ల నియమాకాలను అక్రమంగా తేలుస్తూ 25,753 నియమాకాలను కలకత్తా హైకోర్టు సోమవారం రద్దు చేసింది. నియమక ప్రక్రియకు సంబంధించి తదుపరి దర్యాప్తు జరిపి మూడు నెలలలో నివేదికను సమర్పించాలని జస్టిస్ దేబంగ్సు బసక్, మొహమ్మద్ షభర్ రషీదీలతో కూడిన డివిజన్ బెంచ్ సిబిఐని ఆదేశించింది. నాలుగు వారాల లో తాము తీసుకున్న జీతాలను వాపసు చేయాలని డివిజన్ బెంచ్ అక్రమంగా నియమితులైన టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బందిని ఆదేశించింది. వారి నుంచి డబ్బును వసూలు చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు హైకోర్టు అప్పగించింది. తాజా నియామక ప్రక్రియను చేపట్టాలని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్(ఎస్-ఎస్‌సి)ని డివిజన్‌బెంచ్ ఆదేశించింది. 24,640 ఖాళీ పోస్టుల కోసం ఎస్ఎల్ఎస్‌టి-2016కి 23 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. కాగా ఖాళీలు 24,640 ఉండగా 25,753 నియామక లేఖలు జారీ చేశారని పిటిషనర్ల తరఫు న్యాయవాది ఫిర్దౌస్ షమీమ్ తెలిపారు. కాగా.. ఈఉత్తర్వుపై స్టే ఇవ్వాలని ప్రభుత్వం కోరినప్పటికీ డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళతామని ఎస్ఎస్‌సి చైర్మన్ సిద్ధార్థ్ మజుందార్ తెలిపారు.

TIMES OF VARTHA (22-04-24)_times of varha main (13-2).qxd 4/23/2024 5:33 AM Page 2



## సోమవారం రోజు 12 నామినేషన్లు



### నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 28 నామినేషన్ల దాఖలు

### రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గ స్థానానికి సోమవారం పన్నెండు 12 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సయ్యద్ అస్గర్ సోమవారం రెండవ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారని అన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ మూడవ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారని వివరించారు. అలాగే బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్ సైతం మూడవ సెట్ నామినేషన్ పత్రాలు అందించారని, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అరవింద్ ధర్మపురి రెండవ సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని తెలిపారు. వీరితో పాటు అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగంధర్ గట్ల, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా పోతు అశోక్ నామినేషన్లు వేశారని వివరించారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా ఆర్. రాజేందర్, రాపెల్లి శ్రీనివాస్ లు రెండవ సెట్ చొప్పున నామినేషన్లు వేశారని అన్నారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విట్టల్ మలావత్, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజి ప్రశాంత్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారన్నారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు మొత్తం 28 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

## మోడీ పాలనలో జరుగుతున్న అభివృద్ధే.. బిజెపిని గెలిపిస్తుంది

- మెదక్ ఎంపీ స్థానాన్ని బరాబర్ గెలుస్తాం రఘునందన్ రావు
- పరిశ్రమలు తీసుకువస్తా.. యువతకు ఉపాధి చూపుతా
- బీజేపీ జెండా.. మోదీ ఎజెండా

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి



కమలం గుర్తుకు ఓటేసి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపర్చాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు కోరారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు రోడ్ షో చేపట్టారు. ఈ ఎన్నికల్లో మెదక్ నుంచి తనను ఆశీర్వదించాలని కోరారు. పదేళ్ల మోడీ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన పేద, మధ్యతరగతి ప్రజలు కేంద్రం అందిస్తోన్న సోలార్ విద్యుత్ టవర్‌ను ప్రతీ ఇంటిపై ఏర్పాటు చేసుకుని.. ఉచిత విద్యుత్ ను వాడుకునేందుకు ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. భారతీయ జనతాపార్టీ జెండా.. కేంద్రం జనరంజక పాలన.. మోదీ వేవ్‌తో గెలవడం ఖాయం. ప్రజలు, నాయకులు, కార్యకర్తల సహకారంతో 2లక్షల మెజారిటీతో గెలిచితీరుతా.. ప్రజలు ఏది కోరినా.. సమస్య ఏదైనా పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా.. గత పదేళ్లలో మేనిఫెస్టోను అమలు చేయని కేసీఆర్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దేశం, రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చేసిన వ్యక్తి ప్రధాని మోదీ. పేదల విద్య కోసం రూ.100కోట్లతో నిధి ఏర్పాటు చేస్తానంటున్న వ్యక్తి మూడేళ్లుగా ఎమ్మెల్సీగా ఉండి ఎందుకు ఏర్పాటు చేయలేదు. లోక్‌సభ పరిధిలో ఆగ్రో బేస్డ్ పరిశ్రమలను తీసుకువస్తానని, యువతకు ఉపాధి చూపుతానని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. రఘునందన్‌రావు దుబ్బాకలోనే ఓడిపోయారు అంటున్నారు. అలా అయితే కామారెడ్డిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓడిపోయారు కదా. మిమ్మల్ని ప్రజలు వద్దన్నారు. మళ్లీ ఇప్పుడు ఎలా గెలుస్తారు? కేంద్ర ప్రభుత్వ పనితీరు.. మచ్చలేని ప్రధానిగా పేరున్న మోదీ వేవ్‌తో గెలుస్తాం. జనం గుండెకు దగ్గరకు వెళ్తున్నా.. ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీని కుటుంబ సభ్యుడిగా ఫీలవుతున్నారు. ప్రజల ఆశీర్వాదం, పార్టీ కార్యకర్తలు, నాయకుల సహకారంతో రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తాను. అందుకోసం మా కార్యకర్తలు, నాయకులు పని చేస్తున్నారు.

### మేనిఫెస్టో అమలు చేయని బీఆర్ఎస్

బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. 2018 డిసెంబర్ ఎన్నికల్లో గెలిచి రెండో సారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. 'మా మేనిఫెస్టోనే భగవద్గీత.. ఖురాన్' అని అన్నారు. మరి నిరుద్యోగ భృతి ఏదీ? రూ. 3,116 ఇస్తానని చెప్పిన మాటలు ఏమాయె. 2020లో నేను గెలిచిన తర్వాత నా పాత మేనిఫెస్టో అమలు చేయాలనడం ఎక్కడి నీతి. వ్యక్తిగా గెలిచిన నేను అమలు చేయాలా? వ్యవస్థగా గెలిచి లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ ఎన్నికల హామీలు అమలు చేయాలా? ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మడంలేదు. విశ్వసనీయతను కోల్పోయారు.

### మూడేళ్లుగా ఎందుకు చేయలేదు

గెలిపిస్తే రూ.100 కోట్లతో అది చేస్తా.. ఇది చేస్తా అని వంద అబద్దాలు చెప్పుకోవాల్సిన అవసరం నాకు లేదు. కాళ్లు మొక్కి ఉచితంగా తెచ్చుకున్న ఎమ్మెల్సీ పదవీ చేపట్టి మూడేళ్లవుతోంది. ఏడాదికి రూ.100 కోట్లు పెడితే ఇప్పటి వరకు రూ. 300కోట్లు ఖర్చు పెట్టాలి. ఎందుకు సేవ చేయలేదు. బీఆర్ఎస్‌కు మెదక్‌లో మూడో స్థానమే. అందుకే అమలు చేయని హామీలు ఇస్తున్నారు. మూడేళ్లుగా అవ్వకు అన్నం పెట్టకపోగా.. పిన్నమ్మకు బంగారు గాజులు చేపిస్తా అన్నట్టుగా ఉంది వెంకట్రామిరెడ్డి తీరు.

### ఆగ్రో బేస్డ్ పరిశ్రమలు..

మెదక్ సెగ్మెంట్ పరిధిలో నిరుద్యోగ సమస్య ఎ క్కువగా ఉంది. 40 ఏళ్లు ఒకే కుటుంబానికి సంబంధించిన వారు పాలించారు. నాలుగు కంపెనీలను తీసుకురాలేదు. నలుగురికి ఉపాధి కల్పించలేదు. సిద్దిపేట, మెదక్, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాల్లో ఆగ్రో బేస్డ్ పరిశ్రమలు వస్తే బాగుంటుంది. వాటిని తీసుకువస్తా. స్థానిక సంస్థలను బలోపేతం చేస్తా. ప్రజలందరూ నన్ను ఆశీర్వదించాలని కోరుతున్నా.

### ప్రజలు ఏది కోరుకుంటే అది..

బీజేపీ ఏజెండాను అమలు చేయడంతో పాటు ఈ నియోజకవర్గ అన్ని అవసరాలు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా.. అలాగే ఈ ప్రాంత ప్రజలు ఏది కోరుకుంటే అది చేస్తాం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నుంచి ఎదిగిన బిడ్డగా.. తెలంగాణ ప్రాంతానికి రావాల్సిన ప్రతీ పని... స్కీంను కచ్చితంగా తీసుకువస్తా అని హామీ ఇస్తున్నా.

## ముమ్మరంగా వాహన తనిఖీలు...



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

రానున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం అధికారుల సూచనల మేరకు ఎస్.ఎస్.టి. మరియు స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండల కేంద్రం శివారులో గల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులో ఎస్.ఎస్.టి., స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. హవాలా ద్వారా డబ్బు, మద్యం తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

## ఘనంగా శ్రీ బీరప్ప కామారతి కళ్యాణం...



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ మండలంలోని చిన్న మావంది(మావందిఖుర్దు) గ్రామాల్లో సోమవారం కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప కామారతి కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి బీరప్ప పండగ నిర్వహించడం జరుగుతుందని కుర్మ కుల సంఘం పెద్దలు పేర్కొన్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని,ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని బీరప్ప పండుగను అనవాయితీగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మావందిఖుర్దు కురుమ సంగం మేత్రిసింగారి సంజు, బగులు మేత్రి పోశెట్టి, అధ్యక్షులు సింగారి మారుతి, విగ్రహ దాత మాజీ సర్పంచ్ సింగారి పోశవ్వ శంకర్ దంపతులు, స్థలందాత సింగారి శోభ లచ్చుగొండ దంపతులు, సాయిలు, సుధాకర్, శ్రీను, పట్టణ అధ్యక్షులు వీరయ్య, మండల కురుమ సంఘం అధ్యక్షులు మేడి రవి, బోధన్ మండల గొర్రెల మేకల పెంపకాల సహకార సంఘం అధ్యక్షులు దేవరావు, మాజీ సర్పంచ్ గంగాధర్, మండల వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, గంగాధర్, కురుమ కులస్తులు పాల్గొన్నారు.

## నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలి

టైమ్స్ ఆఫ్ వార్త నిజామాబాద్ సిటీ

ధర్మ సమాజ్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి కండెల సుమన్ నామినేషన్ సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు కంటేశ్వర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నామినేషన్ రాలిని విజయవంతం చేయాలని అభ్యర్థి సుమన్ కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్నీ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నుంచి ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాస్వామ్య వాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు అందరు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ%శీ% లో నిజామాబాద్ అభ్యర్థి సుమన్, జిల్లా నాయకులు మహిపాల్, ప్రేమ్, స్వామి, సాగర్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## భారతదేశంలో కార్మిక వర్గ స్థాపన కోసం కృషి చేయాలి

### సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

భారతదేశంలో కామ్రేడ్ లెనిన్ ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వర్గ స్థాపన కోసం కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ ( ఎం-ఎల్) న్యూడెమోక్రసీ 55వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్ ముందు ఆకుల పాపయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ లేనిన్ రష్యాలో కార్మిక రాజ్య స్థాపన కోసం ప్రజలందరినీ ఏకం చేశాడని, నేడు దేశంలో సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళుతుందని, సంపద కొద్దిమంది దగ్గర కేంద్రీకృతమైందని,పాలకులుజి భారతదేశ వనరులు సామ్రాజ్యవాద దేశాలకు అప్పగిస్తూ విదేశీ జపం చేస్తున్నారని ఆయన అన్నారు. నేడు దేశంలో కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని,నిరుద్యోగం పెరిగిపోయి నిత్యవసరాలు ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు.దీంతో సామాన్యుడు దేశంలో బతికే పరిస్థితి లేదని కావున కామ్రేడ్ లెనిన్ పోరాట స్ఫూర్తితో భారతదేశంలో శ్రామిక వర్గ స్థాపన కోసం పార్టీ శ్రేణులు నిరంతరం పోరాడని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం -ఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, మక్లూరు మండల కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, మోపల్ మండల కార్యదర్శి బండమీద నర్సయ్య, డిచ్ పల్లి కార్యదర్శి గంగాధర్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ,న్యూడెమోక్రసీ నాయకులు పరుచూరి శ్రీధర్ , శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, సత్యం,రమేష్, జెల్ల మురళి, సాయినాథ్, కృష్ణ గౌడ్, భారతి, భాస్కర్, చిన్నయ్య, మోహన్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చాకిరియల్ గ్రామంలో హనుమాన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం

టైమ్స్ అఫ్ వార్త . మెండోరా ఏప్రిల్ (22)



చకి రియల్ గ్రామం లోని హనుమాన్ మందిరం వద్ద హనుమాన్ భక్తులు మరియు గ్రామ డెవలప్మెంట్ కమిటీ సహకారాలతో ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించినారు

## కామ్రేడ్ లెనిన్ కు విప్లవ జోహార్లు అర్పించిన సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి, సీపీఐ (ఎం.ఎల్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో లెనిన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ రష్యన్ బోల్షివిక్ నిర్మాతగా, అక్టోబర్ విప్లవ సారథిగా, కమ్యూనిస్టు విప్లవోద్యమానికి సైద్ధాంతిక భూమిక జోడించిన విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ అన్నారు.కమ్యూనిస్టు పార్టీది వేరోచిత చరిత్ర అన్నారు. ఈ చరిత్రకు వారసత్వం విప్లవోద్యమాన్ని అన్నారు. భారతదేశంలో 1925లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. సిపిఐ, సిపిఎం పార్టీల పార్లమెంటరీ అంతా పైన పాలకవర్గాలతో కలిసిన మితవాద ఆచరణ పైన తిరుగుబాటుగా విప్లవకారులు 1969 ఏప్రిల్ 22న సీపీఐ (ఎం.ఎల్) ఏర్పాటును ప్రకటించారన్నారు. ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం. నరేందర్ మాట్లాడుతూ 1969 ఏప్రిల్ 22న రివిజనిజం మీద పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకంగా విప్లవకారులు ఒక పార్టీగా సిపిఐ (ఎం.ఎల్) ను ఏర్పాటు చేసుకున్నరోజన్నారు. ఐతే ఈ విప్లవోద్యమం మితవాదం, అతీవాదంకు గురైందన్నారు. వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ విలువైన త్యాగపూరిత పోరాట వారసత్వాన్ని స్వీకరిద్దామని అన్నారు. ప్రజాపంథాలో విప్లవోద్యమ నిర్మాణం చేయడమే అమరులకు నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం. వెంకన్న, జిల్లా నాయకులు డి. రాజేశ్వర్ డివిజన్ నాయకులు కిషన్, మురళి పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, వివిధ ప్రజా సంఘాల నాయకులు లింగం, మోహన్, సాయరెడ్డి, చరణ్, జి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయంలో బోరు మోటర్ ఏర్పాటు



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈ రోజున మంచినీటి సౌకర్యార్థం బోరు మోటర్ ని ఏర్పాటు చేయడం. జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు దేవదాయశాఖ జిల్లా అధ్యక్షుడు తోటకూరి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు బండి సైదేశ్వర రావు ,మల్లెల వెంకటేశ్వర్లు, దండా విశ్వనాథం, మరిగండి బసవయ్య ,వడ్రానపు రామయ్య, దేశపోయిన వెంకటేశ్వర్లు ,పోతన పోయిన వెంకటేశ్వర్లు వీరి సమక్షంలో ఈ రోజున బోరు మోటర్ ని ప్రారంభించారు .సుమారుగా 45 వేల రూపాయల ఖర్చుతో నిర్మాణం చేయడం జరిగింది.



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం,
23-04-2024


# పూర్తి బ్రాహ్మణుడిగా ప్రదీప్‌కు పట్టా ప్రదానం

- కేరళ తంత్ర శాస్త్రంలో పూర్తి ఆర్చకుడిగా ప్రశంస పత్రాన్ని పొందిన మొదటి తెలుగు వ్యక్తి
- కుసుమ ప్రదీప్ గురుస్వామి కు మండల ప్రజలు అభినందనలు, హర్షం వ్యక్తం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవ చేయడానికి అక్కడి ఉద్యోగానికి వదిలేయడం జరిగింది



టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

మండల కేంద్రానికి చెందిన కుసుమ ప్రదీప్ కుమార్ గురుస్వామి కేరళ తంత్ర శాస్త్రంలో సంప్రదాయ బ్రహ్మగా తాంత్రిక శిక్షణ పొంది పూర్తి బ్రహ్మనుడిగా ధృవీకరిస్తూ ప్రశంస పత్రాన్ని పొందినట్లు కుసుమ ప్రదీప్ కుమార్ తెలిపారు. కేరళ సంప్రదాయ బ్రహ్మగా తాంత్రిక శిక్షణ పొంది శ్రీ కేరళ తంత్ర పీఠం ఆలప్పర నుండి పూర్తి దైవ, దేవి, దేవత ప్రతిష్ట లు, కుంభాభిషేకాలు, కేరళా తాంత్రిక విధానంలో పూజలు అభిషేకాలు, హెూమాలు చేయుటకు పూర్తిగా యోగ్యుడైన బ్రహ్మనుడిగ గుర్తిస్తూ కేరళ నూతన సంవత్సరము అయిన విషు పర్వదినం అయిన స్నాతకోత్సవంలో ప్రదీప్ గురు స్వామికి కేరళ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులు ఆలప్పరలోని మంత్ర పీఠంలో కన్నుల పండువగా జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సంధర్బంగా ప్రదీప్ గురుస్వామి మాట్లాడు తూ ఎంతో కష్ట సాధ్యమైన కేరళా తంత్ర అభ్యసించడానికి అకుంఠిత దీక్షత చేసిన కృషి కారణంగా తాను సాధించగల గానని తెలిపారు. తాను పట్టా పొందిన తరువాత కేరళ ప్రభుత్వం అక్కడి ఆలయాల్లో అర్చకుడిగా ఉద్యోగ అవకాశం కల్పించిన ఇక్కడి రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవ చేయడానికి అక్కడి ఉద్యోగానికి వదిలేయడం జరిగినదని తెలిపారు. పూర్తిగా మలయాళ మాధ్యమంలో జరిగి రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు సమర్ధంగా ఎదుర్కొని పట్టా పొందటానికి ఐదు సంవత్సరాలు పట్టిందని గురుస్వామి తెలిపారు. కేరళ తంత్ర శాస్త్రంలో పూర్తి ఆర్చకుడిగా ప్రశంస పత్రాన్ని పొందిన మొదటి తెలుగు వ్యక్తి కుసుమ ప్రదీప్ గురుస్వామి అని ఈ సంధర్బంగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

## కంటేశ్వర స్వామీ ఆలయంలో జీవన్ రెడ్డి పూజలు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి స్థానిక కంటేశ్వర స్వామీనీ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఎంపి అభ్యర్థిగా జీవన్ రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఆయన కంటేశ్వర స్వామీ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భం గా ఆలయ అర్చకులు జీవన్ రెడ్డి నీ సన్మానించి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు...

## కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న బాజిరెడ్డి గోవర్ధన్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముడుపు కట్టారు. ఇందులో పాల్గొన్న వారిని జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ లను ఆలయ అర్చకుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు అందజేశారు.

## జీవన్ రెడ్డి మద్దతుగా సీఎం సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ యువ నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త. మెండోరా

నిజామాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయుచున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి మద్దతుగా సోంపేట పోచంపాడు నెహ్రూ నగర్ గ్రామాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి సభకు బాల్కొండ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సోంపేట మాజీ సర్పంచ్ గోలి ప్రకాష్ మాజీ ఎంపిటిసి సుభాష్ భూమేష్ సలీం మహేష్ సాయి రెడ్డి సుంకరి పోశెట్టి మాజీ సర్పంచ్ పులి గంగాధర్ పోచంపాడు మాజీ సర్పంచ్ రమేష్. చందు నెహ్రు నగర్ గ్రామ కాంగ్రెస్ యువ నాయకులు శ్రీనివాస్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు



## బిజెపి నాయకుడు సోదరుడు పెళ్లికి హాజరైన....ఎంపీ అరవింద్...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని విఆర్ఆర్ గార్డెన్ లో సోమ వారం స్థానిక బీజేపీ సీనియర్ నాయకుడు మల్లెపూల శ్రీనివాస్ సోదరుడు వివాహ మహెూత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈమేరకు నిజామాబాద్ బీజేపీ ఎంపీ అరవింద్ పెళ్లికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్, బీజేపీ సీనియర్ నాయకులు నరసింహరెడ్డి,పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం.



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

ఫోటోలోని ఈమె వయసు సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు లోపు ఉండవచ్చు . ఈమె 22- 4-24న ఉదయం 11 గంటల సమయంలో చింతకాని మండలం వందనం శివాలయం వెనుక చేలలో చనిపోయి ఉన్నది . ఈమె ఎడమ చేతిపై ఏ పోచమ్మ అని పచ్చబొట్టు రాసి ఉంటది. ఆచూకీ తెలిసినవారు ఎవరైనా చింతకాని పోలీస్ స్టేషన్కు 8712659152 గాని, 8712659153 కానీ తెలియపరచగలరు అని చింతకాని పోలీసులు కోరినారు.

## నామినేషన్ వేసిన క్యామ మల్లేష్

టైమ్స్ అఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం



భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ సోమవారం యాదగిరి నర్సింహస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భువనగిరి కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రివర్యులు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత, రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,మాజీ మంత్రి ఉమా మాధవ్ రెడ్డిలతో కలిసి క్యామ మల్లేష్ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలు కాంగ్రెస్ పార్టీని స్వాగతిస్తున్నారు..

### మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

టైమ్స్ అఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి



మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కి మద్దతు వెల్లువ కొనసాగుతుంది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బీసీ కుల సంఘాలు, మహిళలు పెద్ద ఎత్తున నీలంకు మద్దతు తెలుపుతున్నారు. చిట్కుల్లోని ఎన్ ఎం అర్ క్యాంపు కార్యాలయానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తున్నారు. నీలం మధు కు పూలబొకేలు ఇస్తూ శాలువతో సత్కరించి మద్దతిస్తున్నారు. బీసీ బిడ్డకు పార్లమెంట్ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాల ప్రజలందరూ ఓటు వేసి గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారు. ప్రజల కష్టాలు తెలిసిన పేదింటి బిడ్డ నీలం మధు లాంటి వ్యక్తి పార్లమెంటుకు వెళ్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తామంతా స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేసి నీలం మధు ముదిరాజ్ ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తేల్చి చెబుతున్నారు.

## పట్నం సునీత మహేందర్ రెడ్డి నామినేషన్ దాఖలుకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పట్నం సునీత మహేందర్ రెడ్డి సోమవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా హయత్ నగర్ నుండి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కళ్లెం సుజాత రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా కళ్లెం సుజాత రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని సంక్షేమ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీత మహేందర్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని పార్లమెంటుకు పంపించవలసిన బాధ్యత మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలపై ఉ ందన్నారు. పట్నం సునీత మహేందర్ రెడ్డి నీ గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.


## అంగన్వాడి కేంద్రంలో ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

టైమ్స్ అఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం



సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం కంకణాల గూడెం అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్వైజర్ నిర్మల,హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు చిన్న పిల్లల తల్లులు అంగన్వాడి కేంద్రాల యొక్క సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నపిల్లలకు అందించేటువంటి ఆహారంలో బలమైనటువంటి పౌష్టిక ఆహార పదార్థాలు ఉండి బలంగా తయారవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పుష్పలత,లోకేశ్వరి, చిన్నపిల్లల తల్లులు, చిన్నారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి



ఆర్‌టిసి బస్సు ప్రైవేటు డ్రైవర్‌పై ఒక ప్రయాణికుడు దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. ప్రయాణికుడి చర్యను నిరసిస్తూ వికారాబాద్ ఆర్‌టిసి డిపోకు చెందిన కార్మికులు 27 ప్రైవేట్ బస్సులను నిలిపి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ డిపో డ్రైవర్ రాములు పై నవాజ్ అనే వ్యక్తి దాడి చేశాడు. బస్సు ఆలస్యంపై డ్రైవర్‌ను నవాజ్ ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాము భోజనం చేస్తున్నామని, ఐదు నిమిషాల్లో బయలుదేరుతామని డ్రైవర్, కండక్టర్ సర్దిచెప్పినా వినకుండా దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఆగ్రహంతో డ్రైవర్ రాములుపై నవాజ్ దాడి చేశాడు. ఈ క్రమంలో నిందితుడు నవాజ్‌పై చర్యలు తీసుకోవాలని బస్సులు నిలిపి ఆర్‌టిసి కార్మికులు ఆందోళనకు దిగారు. ప్రైవేటు బస్సుల డ్రైవర్లు ఉదయం నుంచి పరిగి వికారాబాద్, తాండూర్, హైదరాబాద్ వెళ్లే బస్సులను బంద్ చేసి నిరసన తెలిపారు. దాడి ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్‌టిసి బస్ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితుడిని అరెస్టు చేశామని సిఐ నాగరాజు తెలిపారు. ఎవరైనా ఆర్‌టిసి ఉద్యోగులపై దాడి చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

మంగళవారం,
23-04-2024



# రాజకీయ పార్టీల జోరు..
# ప్రచార హోరు, రైతన్నలూ బజారు..









### అకాల వర్షంతో ఆగమాగం
### మీకు దండం పెడతాం ఆదుకోండి
### అంటున్న ప్రజలు

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి

ఓవైపు నామినేషన్ల ఘట్టం.. మరోవైపు ప్రచార పర్వం ఊపందుకోవడంతో ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ప్రముఖుల రాకతో క్యాడర్‌లో జోష్ పెరిగింది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్‌లు కార్నర్ మీటింగ్‌లు నిర్వహించగా.. వచ్చేనెల 7న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా మెదక్ రానున్నట్లు ఆపార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

#### బీజేపీ దూకుడు

ఈనెల 18న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తన నామినేషన్ వేశారు. అదే రోజు సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి రాందాస్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. మూడోసారి నరేంద్ర మోదీ పీఎం కావడం ఖాయమని, మెదక్‌లో కాషాయజెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, లేదా నిర్మాలా సీతారామన్ ఎవరో ఒకరు వస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు. వచ్చేనెల పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లాలో లక్ష మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనునట్లు.. ఆ సభకు ప్రధాని మోదీతో పాటు అమిత్‌షా వస్తారని పేర్కొన్నారు.

#### వ్యూహాత్మకంగా బీఆర్ఎస్

బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి వెంకట్రామిరెడ్డిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ వ్యూహాత్మకంగా ప్రకటించారు. ఈనెల 24న వెంకట్రామిరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపార్టీ అధినేత కేసీఆర్ వచ్చేనెల 7న మెదక్ వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృతంగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈనెల 15న మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ఆ సభకు మెదక్ జిల్లా నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

#### కాంగ్రెస్‌లో ఉత్సాహం

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరపున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఈనెల 18న నామినేషన్ వేశారు. ఈనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ వచ్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 50 వేల మందిని ర్యాలీకి తరలించడంతో మెదక్ పట్టణం జన సందోహంగా మారింది. కార్నర్ మీటింగ్‌లో సీఎంతో పాటు మంత్రులు, దామోదర, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ ప్రసంగాలు కార్యకర్తల్లో ఉత్తేజం నింపాయి.

#### రోడ్డున పడ్డ రైతులు

కొన్ని రోజులు ఎండల తీవ్రత వలన50% పంటలు ఎండిపోయాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల రాళ్ల వర్షం వలన 35% పంటలు నష్టపోయాయి. అధికారులు అంచనాల మేరకు ఈ యాసాంగి కాలం అంతా రైతుల బతుకులు ఆగమాగం అయ్యాయి మిగిలిన పంటలు చేతికొస్తున్న సందర్భంలో అకాల వర్షం వలన ఎండ పోసిన ధాన్యాలను పకృతి వైపరీత్యాల వలన అకాల వర్షాలు రాళ్ల వర్షం పడడంతో ధాన్యం ఉప్పల్ తడిసి రైతులూ పడ్డారు. రాజకీయ నాయకులు ఎవరు ప్రచారంలో వారు ఉన్నారు. రైతులను ఆదుకునే అధికారులు తెలియకుండా పోయారని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకున్న ప్రభుత్వాన్ని రైతులందరూ కలిసి సహకరిస్తామని తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ర్యాలీలు ధర్నాలు చేపడతామని రైతులు ఆరోపించారు

## హనుమాన్ జయంతి
## ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోండి

మెదక్ జిల్లా ఎస్పీ బి బాలస్వామి.

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి



హనుమాన్ జయంతి ఉత్సవాలు, శోభాయాత్ర ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమాన్ శోభయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ లాంటి అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అవసరం ఉన్న ప్రదేశాలలో ట్రాఫిక్ డైవర్షన్ చేయాలన్నారు. హనుమాన్ శోభయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజా క్షేమం కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తనకు అప్పగించిన విధులను అంకితభావంతో నిర్వహించాలని తెలిపారు. హనుమాన్ శోభయాత్రను జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తూ సంబంధిత పోలీసు అధికారులకు తగిన సూచనలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శోభయాత్ర సమయంలో సామాజిక మాధ్యమాలలో ఇతరుల మనోభావాలను కించపరచడం చేయరాదుని, ఎలాంటి అభ్యంతరకరమైన పోస్టులు పెట్టకూడదని సోషల్ మీడియా పై ఐటీ కోర్ టీమ్ తో నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అలాంటి తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హనుమాన్ జయంతి శోభయాత్ర శాంతియుతంగా ఊరేగింపులు జరుపుకోవాలని, పోలీసులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. మెదక్ జిల్లా పరిదిలోని సున్నితమైన ప్రదేశాలలో ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, ప్రజలు సంతోషంగా, శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, ఇతర మతస్తులను గౌరవిస్తూ తమ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని మత సామరస్యం కలిగి ఉండాలని పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## చెరువులో గుర్తు తెలియని వ్యక్తి
## మృతదేహం లభ్యం..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని సాటపూర్ గెట్ వద్ద గల అడి చెరువులో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్య మయింది. తెల్లటి చొక్కా నలుపు రంగు పాయింటు ధరించి ఉన్నాడు. దాదాపు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అడి చెరువులో సోమవారం శవమై తేలాడు. ఈ విషయమై స్థానికులు ఎడపల్లి పోలీసులకు సమాచార అందించగా ఎస్సై వంశీ కృష్ణ అడి చెరువుకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే ఎడపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వవలసిందిగా ఆయన కోరారు.

## ఆటో స్కూటీని డీ కొట్టడంతో
## ఐదుగురికి తీవ్ర గాయాలు...




టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని అలీసాగర్ పంపుహౌస్ వద్ద సోమవారం సాయంత్రం ఆటో స్కూటీ డీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయని తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం... నిజామాబాద్ నుండి బోధన్ వైపు వస్తున్న TS16 UB 6016 నెంబర్ గల ఆటో అలీసాగర్ పంప్ వద్దకు రాగానే ఓ ఫంక్షన్ కు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్కూటీని డీ కొట్టడంతో ఈఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయిని స్థానికులు తెలిపారు. గాయపడ్డవారిని స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆటోలో నిజామాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

## మెదక్ రూరల్ ఎస్సై సస్పెండ్..

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి




ఇసుక ట్రాక్టర్ యజమాని వద్ద డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో ఏసీబీ కి చిక్కిన కానిస్టేబుల్, మెదక్ రూరల్ ఎస్ ఐ అమర్, మారో కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ లో గత నెల 19 న ఆసుల పల్లి కి చెందిన కందుల చంద్రం వద్ద ఇసుక ట్రాక్టర్ స్టేషన్ నుంచి వదిలి పెట్టే విషయంలో 20 వేలు లంచం మాట్లాడుకొని 15 ఇచ్చిన విషయం తెలిసిందే. ఐతే మిగితా ఐదు వేలు ఇవ్వాలని పోలీస్ స్టేషన్ రైటర్, కానిస్టేబుల్ సురేందర్ ఒత్తిడి చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ నీ ఆశ్రయించి గత నెల 19 రెడ్ హ్యాండెడ్ గా సురేందర్ కు నాలుగు వేలు లంచం ఇస్తూ పట్టించాడు. ఏసీబీ అధికారుల విచారణలో గతంలో ఇచ్చిన డబ్బులు 15 వేలు ఎవరికి ఇచ్చారన్న దాంట్లో ఆ డబ్బులు ఎస్ ఐ అమర్, మారో కానిస్టేబుల్ భాసిత్ కు ఇచ్చినట్టు కానిస్టేబుల్ సురేందర్ ఏసీబీ అధికారుల చెప్పినట్టు తెలిసింది. ఇటీవల కూడా మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ ఏసీబీ అధికారులు మరో మారు విచారణ జరిపారు. ఇసుక ట్రాక్టర్ యజమాని చంద్రం గతంలో ఇచ్చిన పదిహేను వేల లంచం ఎస్ఐ అమర్, కానిస్టేబుల్ బాసీత్ కు ముట్టినట్లు రుజువు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ బాల స్వామి ఎస్ఐ అమర్ తో పాటు కానిస్టేబుల్ బాసిత్ లను శాఖ పరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాదు..
# రైతన్నల బాధలను టచ్ చేసి చూడండి

- సీఎం రేవంత్ రెడ్డికి తన్నీరు హరీష్ రావు సవాల్
- మెదక్‌ను కేసీఆరే అభివృద్ధి చేసిండు
- నిన్ను మెదక్‌కు రప్పించిన ఘనత కూడా కేసీఆర్‌దే: హరీశ్‌రావు ధ్వజం
- బీఆర్ఎస్ గెలుపు ఖాయమని స్పష్టం చేసిన మాజీ మంత్రి

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి



నువ్ టచ్ చేయాల్సింది మా ఎమ్మెల్యేలను కాదు.. బాధల ఉన్న రైతులను టచ్ చెయ్.. ఆరు గ్యారెంటీలను టచ్ చెయ్..' అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హితవు పలికారు. 'మా ఎమ్మెల్యేలను కొంటే ఇద్దరిని కొనొచ్చు. కానీ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కొనలేవు. ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టు. ఆరు గ్యారెంటీలు అమలు చెయ్యి. లేదంటే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెడుతరు' అని ఘాటుగా హెచ్చరించారు. మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రాగౌడ్, ర్యాకల శేఖర్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'మాట తప్పుడు, అబద్ధాలాడుడు నీ నైజం, అబద్ధాలాడడంలో నీకు ఆస్కార్ అవార్డు ఇయ్యాలె. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నవ్.. తీసుకున్నవా? వంద రోజుల్లో మీరు చేస్తామన్న హామీలు ఏమైనయ్?' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్వేశించి హరీశ్ ధ్వజమెత్తారు. 'నిన్న ముఖ్యమంత్రి మెదక్ వచ్చి ఒక్కటన్న మెదక్‌కు పనికొచ్చే మాట మాట్లాడిండా?.. రేవంత్ నిలబడ్డ రాందాస్ చౌరస్తా కేసీఆర్ అభివృద్ధి చేసిందే, మెదక్‌కు ఏం చేశాడో చెప్పడానికి ఈ ఒక్క సాక్ష్యం చాలు' అని అన్నారు. రేవంత్.. మీ అభ్యర్థి నామినేషన్ కోసం నువ్వొచ్చిన కలెక్టరేట్ ఎక్కడిది? నువ్వు తీసిన ర్యాలీలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఫోర్‌లేన్ రోడ్లు, రాందాస్ చౌరస్తా, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, మంజోజిపల్లి బ్రిడ్జి కనబడలేదా?' అని ప్రశ్నించారు. 'మీ హయాంలో ఘనపూర్ కాలువ తుప్పుపట్టి పోయింది, పగుళ్లు పెట్టినయ్. కేసీఆర్ హయాంలో ఘనపూర్ ప్రాజెక్టుకు మహర్దశ వచ్చింది' అని గుర్తుచేశారు. ఏడుపాయల అమ్మవారికి కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేసి మెదక్‌కు అన్యాయం చేసింది రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. 'ఆ దుర్గమ్మ ఉసురు తగులుతుంద'ని మండిపడ్డారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో యూనివర్సిటీలు, రైళ్లు వచ్చాయంటే అది కేసీఆర్ చలవేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మెదక్‌కు రైలు గురించి ఎన్నడూ పట్టించుకోలేదని, కేసీఆర్ రైల్వే అధికారులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి రూ.100 కోట్లు ఇస్తేనే ఈ రోజు మెదక్‌కు రైలు వచ్చిందని చెప్పారు. మెదక్‌కు మెడికల్ కళాశాలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఇక్రిశాట్‌ను ఇందిరాగాంధీ ఇచ్చారంటున్నారని, ఇక్రిశాట్‌ను తెచ్చింది నాటి ప్రధానమంత్రి చరణ్‌సింగ్ అని గుర్తు చేశారు. బీహెచ్‌ఈఎల్ 1952లో ప్రారంభిస్తే ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేసింది 1980లో అని చెప్పారు. ఇలాంటి అబద్ధాలు మాట్లాడడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

#### మంత్రులకు అహంకారం నెత్తికెక్కింది

కాంగ్రెస్ పార్టీ మంత్రులకు అహంకారం నెత్తికెక్కి వీర్రవీగుతున్నారని, గాల్లో తేలియాడుతున్న కాంగ్రెస్ నేల మీదికి రావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని ప్రజలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. 'కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాయం తీసుకుంటా అన్నవ్.. తీసుకున్నవా? మాట తప్పడం మీ నైజం, అబద్ధాలు మాట్లాడడం మీ నైజం' అని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వెంకట్రామిరెడ్డిని పట్టుకొని ఎక్కడి నుంచో వచ్చారంటరా? నువ్వు కొడంగల్‌లో ఓడిపోతే మల్కాజిగిరి నుంచి పోటీ చేశావు కదా?. వెంకట్రామిరెడ్డి ఈ జిల్లాలో 20ఏండ్లు పనిచేసిండు. అతడు వేరే జిల్లాకు చెందినవాడెట్లయితడు?. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుటుంబ సభ్యులు పటాన్‌చెరువులో మా అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి ఓట్లేసింద్రు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఈ నియోజకవర్గ ఓటరు' అని తెగేసిచెప్పారు.

#### నా ఎత్తుతో నీకేం పని?

'నా ఎత్తు గురించి నీకేం పని.. నేను పొడువుగా ఉంటా.. ఎట్లనన్న ఉంటా.. నా గురించి పక్కన పెట్టి రైతుల తిప్పల గురించి ఆలోచించు.. వాళ్ల సమస్యలు పరిష్కరించు' అని రేవంత్‌కు హరీశ్ హితవుపలికారు. రామాయంపేట మండలం తొనిగండ్లలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంలో అక్కడి రైతులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని, లారీలు రావడం లేదని ఆవేదన చెందినట్లు చెప్పారు. మొలకెత్తిన ధాన్యాన్ని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు.

#### బాండ్ పేపర్ ఇజ్జత్ తీసినవ్

'రేవంత్‌రెడ్డీ.. నువ్వు బాండ్ పేపర్ ఇచ్చి ఆ బాండ్ పేపర్ ఇజ్జత్ తీసినవ్.. బాండ్ పేపర్ అంటే నమ్మకానికి ప్రతీక. ఆరు గ్యారెంటీల్లో, ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదంటున్నవ్.. నిండు అసెంబ్లీ సాక్షిగా భట్టి విక్రమార్క అనలేదా?' అని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఎగవేత, దాటవేతలో పోటీ పడుతున్నారని హరీశ్ ఎద్దేవాచేశారు.



TIMES OF VARTHA (22-04-24)_times of varha main (13-2).qxd 4/23/2024 5:33 AM Page 5



# 25న బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నామినేషన్



### ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి

### పార్లమెంట్ నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున కషాయదళం తరలి రావాలి

టైమ్స్ఆఫ్ వార్త-ఉమ్మడి వరంగల్ జిల్లా:
కాంగ్రెస్ 100 రోజుల పాలనలో... పాలన చేత కాక చేతులు ఎత్తేసిందని వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని హంటర్ రోడ్డులో గల బీజేపీ పార్లమెంటరీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధన్నపేట ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 25న నామినేషన్ వేస్తున్న సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.
హన్మకొండలోని వెయ్యి స్తంభాల గుడి నుంచి వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి పాల్గొనున్నారని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులకు మన కార్యకర్తలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంటా రవి కుమార్, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, వర్ధన్నపేట అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ రావు, జెడ్పి వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జెడ్పిటిసి సునీత, పీఏసిఎస్ చైర్మన్లు జక్కు రమేష్, వనం రెడ్డి, కార్పొరేటర్లు అనిత - రంజిత్, సరోజన, నాయకులు బన్న ప్రభాకర్, మండల, డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్నం సునీత మహేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కదం తొక్కిన కాంగ్రెస్ నాయకులు



టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:
మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి ఆధ్వర్యంలో ఎల్.బి నగర్ నియోజకవర్గం నుండి సునీతమ్మ నామినేషన్ కార్యక్రమానికి భారీగా బయలుదేరిన ఎల్.బి నగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.జన సందోహం తో నిండిన బస్సులకు జెండా ఊపిన ఎల్.బి నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి.ఈ సందర్బంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ని ఏవిధంగా అయితే భారీ మెజార్టీతో గెలిపించామో అదేవిధంగా ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీత మహేందర్ రెడ్డిని కూడా భారీ మెజారిటీతో గెలిపించడానికి కంకణం కట్టుకున్నామని అన్నారు.అదే విధంగా రాష్టం లో అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగా అయితే కేసీఆర్ అవినీతి పార్టీ టిఆర్ఎస్ ను బొంద పెట్టి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారో అదేవిధంగా ఇప్పుడు కేంద్రంలో కూడా అవినీతి బిజెపి పార్టీని ప్రజలు పొందబెట్టి కేంద్రంలో కూడా ప్రజలు కాంగ్రెస్ పార్టీని తప్పకుండా ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేసారు.టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి ఆధ్వర్యంలో నేడు సునీతమ్మ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నుండి భారీగా తరలి వెళ్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముద్దగౌని రామ్మోహన్ గౌడ్,మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న గౌడ్, నియోజవర్గ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, పలు డివిజన్ ల అధ్యక్షులు,కాంగ్రెస్ శ్రేణులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

- వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి జోరుగా వలసలు..



టైమ్స్ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:
వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి, మామునూరు విమానాశ్రయం, ఏనుమాముల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి, వరంగల్ ను అభివృద్ధి చేసి చూపిస్తానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. హన్మకొండ జిల్లా, ఐనవోలు మండలం, వెంకటాపురం గ్రామం నుండి బీజేపీ జిల్లా నాయకులు మదాసు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సుమారు 100 మంది బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి అరూరి రమేష్ ఆహ్వానించారు.

### మొదటి ఓటును వృధా చేయము

మొదటి ఓటు హక్కును వృధా చేయకుండా నరేంద్ర మోడీకి ఓటేసి సద్వినియోగం చేసుకుంటామని నూతన యువఓటర్లు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నూతన యువఓటర్లు వర్ధన్నపేట బీజేపీ మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో అడుప రాజు, మూల రాము, సట్ల రాజు, సట్ల అనిల్, గడ్డం కుమార్, గడ్డం శ్రీనివాస్, గడ్డల మహేష్, కంచె రాజు, వరంగంటి నాగరాజులకు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ బీజేపీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీటీసీ రాజేందర్, నాయకులు రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం పగిడిపల్లి గ్రామం బాబోజి తండాలో చంద్రశేఖర్ కుమారుడి వివాహానికి సోమవారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ చిన్న గూడూరు మండల ప్రధాన కార్యదర్శి కర్రె దారాసింగ్, పార్టీ నాయకులు యాకి, గంధసిరి వెంకన్న, కుసుమ వెంకన్న, మంగీలాల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బిఆర్ఎస్ 16 ఎంపీ స్థానాలను గెలుచుకోబోతుంది

- కొన్నిచోట్ల కాంగ్రెస్ మరికొన్నిచోట్ల బిజెపి మాతో పోటీ పడుతుంది
- స్వార్థ ప్రయోజనాల కోసం రాహుల్ ఆశయాలకు విరుద్ధంగా మోడీ మేర బడా భాయ్ అంటున్నది రేవంత్ రెడ్డి కాదా?
- బిజెపితో అంటకాగుతుంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ?
- మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి







టైమ్స్ ఆఫ్ వార్త - యాదాద్రి
ఆచరణకు నోచుకోని వాగ్దానాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు తమ ప్రభుత్వ 120 రోజులు పాలనకు రెఫరండం లాంటివని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించుకుంటూనే మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మా పరిపాలనను ప్రశ్నించడం ఏంటని అనటం సీఎం రెండు నాలుకల ధోరణితో ముందుకు సాగిపోతున్నారని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు గుంటకల్ జగదీశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో వి ఆర్ ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ యాదవ్ సోమవారం మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు గొంగడి సునీత మహేందర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఉమా మాత రెడ్డి తో కలిసి నామినేషన్ ఫామ్ ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కు అందజేయగా మరో నామినేషన్ ఫామ్ ను మాజీ మంత్రి గుంతకళ్ల జగదీశ్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ జనగాం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి లు కలిసి మరో నామినేషన్ సెట్ ను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు జె షిండేకు అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలతో మోసపోయారఎన్న భావన వారిలో కలుగుతున్నదన్న నిజాన్ని గ్రహించిన రేవంత్ రెడ్డి సంస్కారహీనమైన రోత భాషతో మాట్లాడుతున్నారని జగదీశ్వర్ రెడ్డి నిశితంగా విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రోడ్ షోలో కార్నర్ మీటింగులలో రాష్ట్ర ప్రజలకు చెక్పోవటానికి ఏమీ లేక ఓటమి భయంతో ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడే భాషను మరవడంతో ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నాడా, అన్న భావన ప్రజలు కలుగుతుందని జగదీశ్ రెడ్డి వివరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏ రాజకీయ పార్టీ అయినా అప్పటి అధికార పార్టీ అనుసరించిన విధానాలపై విమర్శించుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన అనంతరం కూడా కెసిఆర్ పరిపాలన తీరును విమర్శిస్తూనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మా పరిపాలనను ప్రశ్నిస్తాడా? అంటూ రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తున్నాడని ఆయన విమర్శించారు. జరగబోయే పార్లమెంట్ పార్లమెంట్ ఎన్నికల్లో 120 రోజుల కాంగ్రెస్ పరిపాలన లో ఏర్పడిన ప్రజా వ్యతిరేకతతో ఓటమిపాలైతే ఒక తీరు, కొన్ని స్థానాలలో విజయం సాధిస్తే తమ పరిపాలన చూసి ప్రజలు ఓట్లు వేశారని చెప్పుకోవచ్చు అన్న ద్వంద వైఖరితో రేవంత్ రెడ్డి, అతని సహచర మంత్రులు రోత భాషను వాడుతున్నారని జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. అస్తమానం భారతీయ జనతా పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అస్తమానం కెసిఆర్ ఎ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న భావనతో మాట్లాడుతున్నారంటే కెసిఆర్ ను రాష్ట్ర ప్రజలు ఆరవధిస్తున్నారన్నట్టే కదా అని జగదీశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. వారు భావిస్తున్నట్లుగా రాష్ట్రంలో కెసిఆర్ ఆదరణ చెక్కుచెదరకుండా ప్రజల గుండెల్లో ఉన్నందున జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందన్న నమ్మకం బిజెపి, కాంగ్రెస్ మాటల్లో స్పష్టమవుతుందని జగదీశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బ్లాక్ మెయిల్ చేస్తూ కొనసాగుతున్నది కోమటిరెడ్డి బ్రదర్స్. నల్గొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి బ్రదర్స్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ఆ పార్టీ అధినాయకత్వాన్ని బ్లాక్మెయిల్ చేస్తూ పబ్బం గడుపు కుంటున్నారని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తమకు తల్లి లాంటిది అంటూనే ఆ పార్టీ నాయకులకు బ్లాక్ మెయిల్ చేస్తూ ఇతర పార్టీ నాయకులతో అంట కాగుతున్న బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుపోవడం క్రోనీ క్యాపటిలిజంకు అలవాటు పడ్డారని ఆయన ఆరోపించారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తమ ప్రజలకు చేసింది ఏమి చెప్పుకోలేక మాపై దూషణలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. తమ పది సంవత్సరాల పాలనలో తానేన్నడు వారి పట్ల వ్యక్తిగత దూషణలకు పాల్పడలేదని, ప్రస్తుతం వారు బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నప్పుడు తప్పుడు ఆరోపణలు తమపై చేస్తున్నందుకు తాము దీటుగా స్పందించాల్సిన బాధ్యత నాపై ఉందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ మాట్లాడే భాషను రాష్ట్ర ప్రజలు ఇష్టపడరని తమ పార్టీ నాయకులు క్యాడర్ ప్రోద్బలంతో చెత్త నాయకుల పట్ల స్పందించాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు.

### మొదటి నుండి బిజెపితో అంట కాబోతుంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ

రాజకీయంగా ఆయన ఆయా రాజకీయ పార్టీలను మారుస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి మొదటి నుంచి బిజెపితో అంట కాగుతున్నవాడేనని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆశయాల క్రితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని గుజరాత్ మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు మ్మారువలేదని, జగదీష్ రెడ్డి గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం రేవంత్ రెడ్డి ని అధిష్టానం మార్చాల్సి వస్తే ముందస్తుగానే మోడీతో రూపాయి కారు ఒప్పందం మేరకు వ్యవహరిస్తున్నాడని జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. నరేంద్ర మోడీని తృప్తిపరిచేందుకు ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని పార్లమెంట్ స్థానాలలో బిజెపి గెలుస్తుందని రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందేనని ఆయన అన్నారు. గతంలో కోమటిరెడ్డి బ్రదర్స్ రేవంత్ రెడ్డి పై, కాంగ్రెస్ అధిష్టానం పై ఎన్నో విమర్శలు చేసినప్పటికీ బలహీనమైన అధిష్టానం ఉన్నందుకే చర్యలు తీసుకోలేకపోయిందని అందుకే వారు సమయం చూసి వ్యవహరిస్తున్నారని, మెడిసి పడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యవహారం తాత్కాలికమైననని తెలంగాణ రాష్ట్రంలో అసలు సిసిలైన నాయకుడు ప్రజల హీరో కేసీఆర్ అని పార్లమెంట్ ఎన్నికల అనంతరం రోజూ కాబోతున్నదని స్పష్టం చేశారు.



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 23-04-2024


## విప్లవోద్యమం ద్వారానే

# పీడిత ప్రజలకు విముక్తి సాధ్యం

**సిపిఐ(ఎమ్.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) జిల్లా నాయకులు పసునూరి రాజు**

**సిపిఐ(ఎమ్.ఎల్)మాస్ లైన్ (ప్రజా పంథా) ఆధ్వర్యంలో లెనిన్ 154వ జయంతి, సిపిఐ(ఎమ్.ఎల్)55వ ఆవిర్భావ దినోత్సవం**

టైమ్స్ఆఫ్ వార్త–ఉమ్మడి వరంగల్ జిల్లా:

విప్లవోద్యమం ద్వారానే దోపిడీ, పీడన, అణచివేతల నుండి తాడిత, పీడిత ప్రజలకు విముక్తి సాధ్యమని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు పసునూరి రాజు అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల్లో మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 154వ జయంతి, సిపిఐ (ఎం.ఎల్)పార్టీ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శివనగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల్లో జెండా గద్దెలపై ఎర్రజెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పసునూరి రాజు మాట్లాడుతూ... దేశంలో సిపిఐ, సిపిఎం పార్టీలు అనుసరించిన రివిజనిస్టు, నయా రివిజనిస్టు విధానాలను వ్యతిరేకిస్తూ 1969 ఏప్రిల్ 22న చార్ ముజుందార్, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి, చంద్ర పుల్లారెడ్డిల నాయకత్వంలో సిపిఐ (ఎం.ఎల్) పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు వ్యవస్థ మార్పు కోసం, తాడిత, పీడిత ప్రజల రాజ్యస్థాపన కోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులతో మిలాకాత్ అయ్యి దేశ సంపదను దోచుకుంటున్నదని, ప్రజల సంక్షేమాన్ని గాలికొది లేసి, ప్రజల మధ్య కుల, మత విద్వేషాలు రగిలించే చర్యలకు పూనుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ లౌకిక వ్యవస్థకు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రమాదకరంగా మారిన మోడీ ప్రభుత్వానికి ప్రజలంతా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలంతా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, దోపిడీ పీడనలేని సమసమాజ స్థాపనకోసం విప్లవోద్యమంలో భాగస్వాములై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు మైదంపాణి, డివిజన్ నాయకులు సాబిరీకానీ మోహన్, అమరేందర్, వెంకటేష్, సునీల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్**

టైమ్స్ఆఫ్ వార్త–ఉమ్మడి వరంగల్ జిల్లా:



హన్మకొండ, ఆర్ట్స్ కళాశాల మైదానంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ విస్తృత ప్రచారం చేశారు. హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం వాకర్స్ తో కలిసి వాకింగ్ చేస్తూ వారితో మమేకమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలు మోడీ పాలనను కోరుకుంటున్నారని, నరేంద్రమోడీ 10 సంవత్సరాల పాలనలో దేశం సుభిక్షంగా, సురక్షితంగా, అభివృద్ధి పదంలో పయనిస్తుందని, మరోసారి బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోడీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమని, వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి, మామునూరు విమానాశ్రయం, ఏనుమాముల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నరేంద్ర మోడీ కృషితో వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ అమృత్ పథకాలతోపాటు కాజీపేటలో రైల్వేవేగన్ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యాక్షులు తిరుపతి రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు అమరేందర్ రెడ్డి, రావుల కిషన్, జిల్లా పదాధికారులు అమర్నాథ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నరెంట్ల శ్రీనివాస్, విజయ్, వాసుదేవ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సతీష్, మల్లికార్జున్, పద్మజ, గోపిక తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ దాఖలు

టైమ్స్ఆఫ్ వార్త–ఉమ్మడి వరంగల్ జిల్లా:



వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సోమవారం డాక్టర్ కడియం కావ్య తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం మొదటగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కే.ఆర్.నాగరాజు, దొమ్మటి సాంబయ్యతో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

### చేరికలు....

మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి సమక్షంలో రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి, జాఫర్‌గఢ్ మండలంలోని తీగారం, ఘన్ పూర్ మండలంలోని నమిలిగొండ గ్రామాల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 200మంది నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

టైమ్స్ఆఫ్ వార్త–వరంగల్ జిల్లా:



ఇంట్లో నుంచి వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం వర్ధన్నపేట మండలం పరిధిలోని కట్ర్యాల గ్రామానికి చెందిన చేవ్వల్ల చంద్రయ్య (56) ఆదివారం ఉదయం ఇంట్లోనుంచి బయటకు వెళ్లిన వ్యక్తి రాకపోవడంతో బంధువులను, చుట్టు పక్కల వారిని అడిగినా అచూకి లభించకపోవడంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సాయంత్రం కడారిగూడెం గ్రామ శివారులోని బావిలో మృతదేహం తేలడంతో కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి చూడడంతో చంద్రయ్యగా గుర్తించారు. ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఎన్నికలకు ముందే బిజెపి బోణీ

టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :

భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి చెందిన ముఖేష్ దలాల్ గడచిన 12 ఏళ్లలో పోటీ లేకుండా లోక్‌సభ ఎన్నికలో గెలిచిన తొలి అభ్యర్థి అయ్యారు. ఆయనే బహుశా పోటీ లేకుండా పార్లమెంటరీ సీటు గెలిచిన బిజెపి తొలి అభ్యర్థి కూడా. ఈమధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 10 మంది బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో సూరత్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఆయన విజయం చోటు చేసుకుంది. గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇతర అభ్యర్థులు అందరూ బరిలో నుంచి తప్పుకోవడంతో దలాల్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఒకరు తెలియజేశారు. అంతకు ఒక రోజు ముందు కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభానీ నామినేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ప్రతిపాదకుల సంతకాలు సరిగ్గా లేవని ప్రాథమికంగా రిటర్నింగ్ అధికారి కనుగొన్నారు. కాగా, ప్రస్తుతం ఏడు దశలుగా జరుగుతున్న లోఖ్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఇది తొలి విజయం. 18వ లోక్‌సభలోకి దలాల్ ఏకగ్రీవ ప్రవేశానికి ముందు 1951 నుంచి పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ లేకుండా కనీసం మరి 34 మంది ఎన్నికయ్యారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అభ్యర్థి డింపుల్ యాదవ్ 2012లో కన్నౌజ్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీ లేకుండా గెలిచారు. ఆమె భర్త అఖిలేశ్ యాదవ్ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన తరువాత కన్నౌజ్ సీటుకు రాజీనామా చేశారు. పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ లేకుండా ఎన్నికైన ఇతర ప్రముఖ నేతల్లో వైబి చవాన్, ఫరూఖ్ అబ్దుల్లా, కెవెల్ రావు, హరే కృష్ణ మెహతాబ్, టిటి కృష్ణమాచారి, పిఎం సయీద్, ఎస్‌సి జమీర్ కూడా ఉన్నారు. పోటీ లేకుండా లోక్‌సభ సభ్యులుగా ఎన్నికైన అభ్యర్థుల్లో గరిష్ఠంగా కాంగ్రెస్ నుంచి ఉన్నారు. సిక్కిం, శ్రీనగర్ నియోజకవర్గాలు అటువంటి ఏకగ్రీవ ఎన్నికలను



రెండు సార్లు చూశాయి. ఎక్కువ మంది అభ్యర్థులు సార్వత్రిక లేదా రెగ్యులర్ ఎన్నికల్లో పోటీ లేకుండా గెలవగా, డింపుల్ యాదవ్‌తో సహా కనీసం తొమ్మిది మంది ఉప ఎన్నికల్లో పోటీ లేకుండా విజయం సాధించారు. 1957లో గరిష్ఠంగా ఏడుగురు అభ్యర్థులు పోటీ లేకుండా సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందారు. 1951, 1967 ఎన్నికల్లో ఐదుగురేసి, 1962లో ముగ్గురు, 1977లో ఇద్దరు, 1971, 1980,1989లో అదే రీతిలోఒక్కొక్కరు ఎన్నికల్లో గెలిచారు.

# దేశ ప్రధాని విచ్ఛిన్నకర మాటలు సరికాదు

టైమ్స్ఆఫ్ వార్త–ఉమ్మడి వరంగల్ జిల్లా:

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం రాజస్థాన్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచార బహిరంగ సభలో స్థాయి మరిచి మాట్లాడటం సరికాదని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పందా) మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సిపిఐ ఎంఎల్ 55వ ఆవిర్భావ సందర్భంగా సోమవారం తొర్రూర్ లో ఆర్ అండ్ బి గెస్టౌస్ వద్ద పార్టీ డివిజన్ కార్యదర్శి మంగంపల్లి వీరన్న జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ... భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అసత్యాలు అబద్ధాలు మాట్లాడుతున్న మోడీ ఎన్నికలలో అడ్డదారులలో అధికారంలోకి రావటానికెనని దేశ ప్రజానీకం ఆలోచించాలని అన్నారు. లౌకిక విలువలను పరమత సహాయాన్ని కోరుతూ వందల సంవత్సరాలుగా కలిసి ఉన్న భారతీయ ప్రజలను కార్పొరేట్ దోపిడి సంస్థల లాభాల కోసం విడదీయటానికి చేస్తున్న కుట్రలను చిత్తు చేయాలని అన్నారు. మోడీ మరోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం అది ఇచ్చిన హక్కులన్నీ కాలరాయపడతాయని, మొత్తం దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడబోతుందని అన్నారు.

ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మాటను తప్పి, బజ్జిల బండి పెట్టి ఉపాధి పొందామని చెప్పిన మోడీ ప్రభుత్వం గద్దె దిగాలని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బిజెపి, ఎన్డీఏ కూటమికి ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్, బిజెపిలను




విమర్శించడం తప్ప, ఇచ్చిన హామీలను సమర్థవం తంగా అమలు చేయడంలో దృష్టి పెట్టడం లేదని విమర్శిం చారు. తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపో యిన రైతాంగాన్ని ఎకరాకు రూ.30వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని లేదంటే ఆందోళనలు తప్పవని అన్నారు. తొర్రూర్ సంయుక్త మండలాల కార్యదర్శి చింతా నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు షరీఫ్, బాలు, బీమా, వెంకన్న, రామస్వామి, యాక స్వాములు, వీరస్వామి, ప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు.

**PRINTED, PUBLISHED & OWNED BY** G.JANARDHAN REDDY, H.NO, 16-11-511/B/7,OPP : STREET KRISHINANDA MATAM, DILSUKHNAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor G.JANARDHAN REDDY, RNI NO. **APTEL/2007/22828** CELL: 9948789066



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం,
23-04-2024



## ఆగి ఉన్న లారీ కిందకు దూసుకెళ్లిన కారు.. దంపతులు దుర్మరణం

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట





ఆగి ఉన్న లారీ (కంటైనర్) కిందకు కారు దూసుకువెళ్లిన ఘటనలో దంపతులు మృతి చెందారు. ఈ విషాద సంఘటన సూర్యాపేట జిల్లా, మునగాల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుండి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సామినేని నవీన్ రాజు (29), భార్గవి (27) అనే దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టిఆర్ కృష్ణా జిల్లా, నూజివీడు మండల పరిధిలోని విసన్నపేట గ్రామానికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

## ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా..

### బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



బీఆర్ఎస్ అధినేత..తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రెండోసారి మీ ముందుకు వస్తున్నాను. ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా మంగళవారం ఉదయం 10.30 గంటలకు మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయబోతున్నాను.. కావున నాడు ఉద్యమ సమయంలో చూపించిన స్ఫూర్తితో మీ అభిమానాల ఆశీర్వాదంతో మీ ఆడబిడ్డను అయిన నన్ను దీవించడానికి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు.. అభిమానులు.. ప్రజలకు మీ ఇంటి బిడ్డ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత విన్నపంగా తెలిపారు.

# రాష్ట్రంలో బిజెపి క్లీన్ స్వీప్

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ప్రధాని నరేంద్ర మోడీకి హవాతో తెలంగాణలో ని అన్ని లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ క్లీన్‌స్వీ ప్ చేస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గో యల్ ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా రా జేంద్రనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గో యల్ ప్రసంగిస్తూ.. బిజెపి అండగా అన్ని వర్గాలు ఉన్నాయని, దేశంలో 400కు పైగా ఎంపి స్థా నా ల్లో విజయం సాధించి ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ కా వడం ఖాయమని విశ్వాసం వ్య క్తం చేశారు. ప్రస్తుతం జరుగుతు న్న లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవని, ప్రజలం తా దేశం కోసం మోడీ నాయకత్వాన్నిబలపరుస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారమే లక్ష్యంగా సిద్ధాంతాలను గాలికి వదిలేసి ఇండియా కూటమి పేరుతో ఒక్కటైనా జనం మాత్రం వారిని విశ్వసించడం లేదని అన్నారు. కూటమి పేరుతో ఒక్కటైనవారు ఆయా రాష్ట్రాలలో మాత్రం ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం చూస్తున్న జనం కామెడీగా తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కేరళలో సిపిఎంను, పశ్చిమ బెంగాలలో తృణమూల్‌ను తిడుతూ ఢిల్లీలో మాత్రం కూటమి అంటూ దోస్తీ చేస్తారని వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వ సమర్థవంతమైన విధానాలతో అంతర్జాతీయంగా భారత్ అగ్రభాగం వైపు సాగుతోందన్నారు.



2030 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద అర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయమని అన్నారు. చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఘన విజయం సాధించనున్నారని అన్నారు. కాగా ప్రజల అండతో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. ఎంపి లక్ష్మణ్, మాజీ ఎంఎల్ఎ కె.ఎస్.రత్నం, పార్టీ మహేశ్వరం ఇన్‌ఛార్జి శ్రీరాములు యాదవ్‌తో కలిసి కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

# శతక జైస్వాల్

### ఛేదనలో యశస్వి అజేయ సెంచరీ

### ముంబయిపై రాజస్థాన్ ఘన విజయం

### ముంబయి 179/9, రాజస్థాన్ 183/1

**జైపూర్ :**

రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ 17లో ఏడో విజయం సాధించింది. 180 పరుగుల ఛేదనలో యశస్వి జైస్వాల్ (104 నాటౌట్, 60 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సులు) అజేయ సెంచరీతో చెలరేగాడు. సంజు శాంసన్ (38 నాటౌట్, 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), ఓపెనర్ జోశ్ బట్లర్ (35, 25 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు. ఓపెనర్లు తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించగా.. యశస్వి జైస్వాల్, సంజు శాంసన్ రెండో వికెట్‌కు అజేయంగా 109 పరుగుల భాగస్వామ్యంతో చెలరేగారు. దీంతో 18.4 ఓవర్లలోనే రాజస్థాన్ రాయల్స్ 183 పరుగులు చేసి లాంఛనం ముగించింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్ పేసర్ సందీప్ శర్మ (5/18) ఐదు వికెట్ల ప్రదర్శనతో విజృంభించినా.. తెలుగు తేజం తిలక్ వర్మ (65, 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ సెంచరీతో కదం తొక్కటంతో ముంబయి ఇండియన్స్ మెరుగైన స్కోరు సాధించింది. నెహాల్ వదెరా (49,



24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మణికట్టు మాయగాడు యుజ్వేంద్ర చాహల్ (1/48) ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

**నువ్వా.. నేనా :**

సొంతగడ్డ జైపూర్‌లో టాస్ ఓడిన రాజస్థాన్ రాయల్స్ తొలుత బౌలింగ్‌కు వచ్చింది. గత మ్యాచ్‌లో ముంబయికి బంతితో చుక్కలు చూపించిన రాయల్స్ పేసర్లు.. మరోసారి ఆ జట్టును భయపెట్టారు. ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ విజృంభించటంతో టాప్-3 బ్యాటర్లు రోహిత్ శర్మ (10), ఇషాన్ కిషన్ (0), సూర్యకుమార్ యాదవ్ (10) 20 పరుగులకే డగౌట్‌కు చేరుకున్నారు. పవర్‌ప్లే మధ్యలోనే కీలక బ్యాటర్లను కోల్పోయిన ముంబయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో తిలక్ వర్మ (65), మహ్మద్ నబి (23) ముంబయిని ఆదుకున్నారు. పవర్‌ప్లేలో మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించారు. ఆరు ఓవర్ల అనంతరం 45/3తో నిలిచిన ముంబయి స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించింది. కానీ తిలక్ వర్మ షోతో ఆ జట్టు బలంగా పుంజుకుంది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లు సంధించిన తిలక్ వర్మ 38 బంతుల్లో స్ఫూర్తిదాయక అర్ధ సెంచరీ సాధించాడు. మహ్మద్ నబి నిష్క్రమించినా.. నెహాల్ వదేరాతో కలిసి జోరు కొనసాగించాడు. తిలక్ వర్మ, నెహాల్ మెరుపులతో ముంబయి ఊపందుకుంది. 15.5 ఓవర్లలో 150 పరుగుల మార్క్ అందుకుంది. దీంతో 200 పరుగులు సాధ్యమే అనిపించింది. కానీ డెత్ ఓవర్లలో రాయల్స్ బౌలర్లు మరోసారి ఆకట్టుకున్నారు. వరుస వికెట్లతో ముంబయిని దెబ్బకొట్టారు. తిలక్ వర్మ, నెహాల్ నిష్క్రమణ తర్వాత హార్దిక్ పాండ్య (10), టిమ్ డెవిడ్ (3), గెరాల్డ్ (0) నిరాశపరిచారు. చివరి 18 బంతుల్లో 4 వికెట్లు కోల్పోయిన ముంబయి 18 పరుగులే చేసింది. దీంతో ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులకే పరిమితమైంది.

# కేంద్ర వ్యవసాయ మంత్రి ఖాయం

(మొదటి పేజీ తరువాయి)..



ఆశించినప్పటికీ 100 రోజుల్లో చక్కర ఫ్యాక్టరీ తెరిపిస్తారని అండగా నిలిచినప్పటికీ ఆ ఫ్యాక్టరీని తెరిపించలేదు అన్నారు. అంతేకాకుండా పసుపుకు గిట్టుబాటు ధర సైతం తేలేకపోయారన్నారు. చెరుకు రైతులు, పసుపు రైతులే కాకుండా ఈ ప్రాంతంలో ఎంతోమంది వ్యవసాయ ఆధారిత రైతులు ఉన్నారని, వారందరినీ కూడా ఆమె పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు ప్రజలు ఎదుర్కొన్న అధికార వైఫల్యాలను దృష్టిలో ఉంచుకొని మళ్లీ అవకాశం రాకపోదా అని నిర్ణయించుకొని గత ఎన్నికల్లో 100 మీటర్ల లోతులో గోతి తీసి పాతిపెట్టి దానిమీద మళ్లీ మొక్క మొలవకుండా తమ నిర్ణయాన్ని ఈ విధంగా చూపించారన్నారు. ఈ పరిణామాలు దృష్ట్యా తదనంతరం జరిగిన ఎన్నికల్లో కవిత పోటీ చేసేందుకు సాహసించలేదు అన్నారు. అంటే రైతులను మోసం చేస్తే శాశ్వతంగా రాజకీయ సమాధి అని ఈ ప్రాంత రైతులు నిరూపించారన్నారు. ఈ విషయంలో ఈ ప్రాంత రైతులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఇకపోతే ఏనుగులను తినేవాడు ఒకడైతే పీనుగులను తినేవాడు ఒకడు అన్నట్టు వంద రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బిజెపి అభ్యర్థి అరవింద్ బాండ్ పేపర్ పై ఐదు రోజుల్లో పసుపు బోర్డ్ తెస్తానని హామీ ఇచ్చినప్పటికి ఇప్పటికీ తేలేదన్నారు. ఈ విషయంలో భారత ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ ఇచ్చిన లేఖలో ఏమాత్రం స్పష్టత లేదని ఆయన ఎండగట్టారు. రైతులను మభ్యపెట్టి మోసం చేస్తూ స్పైసెస్ బోర్డు పసుపు బోర్డు కు తేడా లేకుండా రైతులను అరవింద్ మోసం చేశారని ఆరోపించారు. ఈ ప్రాంత రైతులకు ఏ కాలంలో.. ఏ సమయంలో.. ఏ పంటవేయాలో బహటంగా తెలిసిన అనుభవజ్ఞుడైన రైతులని ఆయన తెలిపారు. ఈ విధానం చూస్తుంటే రిన్ సబ్బు కు రన్ సబ్బుకు తేడా లేకుండా అది ఇది ఒకటే అనే విధానంలో అరవింద్ తీరు ఉందన్నారు. రైతు గురించి తెలుసుకోవాలనుకుంటే కాన్వెంట్ స్కూల్ లో చదువుకున్న నీలాంటి వారికి తెలియదు కానీ మీ తండ్రి అయిన ధర్మపురి శ్రీనివాసును అడిగి తెలుసుకోమని సూచించారు. రైతు సమస్యల విషయంలో హర్యానా, పంజాబ్ ప్రాంత రైతులు వారి సమస్యలను పరిష్కరించేందుకు స్వయంగా పోరాడతారని అదే బాటలో నిజామాబాద్ ప్రాంత రైతులకు అంతటి సత్తా ఉందన్నారు. అలాంటి ఆత్మగౌరవం ఉన్న రైతులు నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంత రైతులే అని వారిని ప్రశంసించారు. అందుకే వంద రోజుల్లో చక్కెర కర్మాగారాన్ని తెస్తాను అన్న వారు తెలియకపోవడంతోనే తిరగబడిన రైతులు వారిని పొలిమేరలు దాటించే వరకు తరిమి కొట్టారన్నారు. ఇదిలా ఉంటే ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తాను అన్న ఆయన పరిస్థితి ఏంటో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని ఆయన జీవితాన్ని అంకితం చేస్తా అని ఆలోచనతో జీవన్ రెడ్డి ముందుకు రాగా అప్పటివరకు ఎంపీగా జాబితాలో లేని జీవన్ రెడ్డికి రైతుల పక్షాన పోరాడుతానని ఆయనకున్న అంకిత భావాన్ని గుర్తించి సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ లను ఒప్పించి ఎంపీ టికెట్ ఇప్పించానని ఆయన అన్నారు. ఇకపోతే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించేందుకు పార్లమెంటులో గళం విప్పి రైతుల పక్షాన పోరాడుతానని జీవన్ రెడ్డికి ఉన్న పట్టుదల గుర్తించామన్నారు. ఆయన ఎంపీగా గెలిచిన వెంటనే ఇండియా కూటమి ఏర్పాటు చేసి జీవన్ రెడ్డిని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పదవిలో కూర్చోబెట్టడం ఖాయం అని ఆయన మాటిచ్చారు. అయితే ఒక్కోసారి ఓటమి కూడా గెలుపునకు పునాది వేస్తాయని ఆయన అన్నారు దీనికి ఉదాహరణ రానే అని తెలిపారు. 2018 సంవత్సరంలో ఆయనపై కక్ష కట్టి అర్ధరాత్రి తన ఇంటి మీదకి పోలీసులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసి నిర్బంధించిన సందర్భాన్ని గుర్తు చేశారు. దీంతో పలువురు ఉన్నతాధికారులు సస్పెండ్ అయిన సందర్భాలు ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం శిరసావహించి ఎంపీగా పోటీ చేసి ఘన విజయం సాధించిన చరిత్ర తనపై జరిగిన అన్యాయానికి నిదర్శమని ఆయన రుజువు చేశారు. నిజామాబాద్ జిల్లా రైతుల ఆశీర్వాదంతో అధిష్టానానికి తనపై నమ్మకం వచ్చిందన్నారు. దీంతో ఆనాడు పిసిసి అధ్యక్షునిగా, నేడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అయినానని తెలిపారు. 2018 ఓటమి 2023 విజయానికి ముఖ్యమంత్రిగా గెలవడానికి పునాది అని ఆయన ఉదాహరణలు పునాది అని ఆయన ఉదహరించారు. 2014లో టిఆర్ఎస్కు ఓటేసి కవితను గెలిపించుకున్నారు. కానీ రైతులు మోసపోయారు, 2019 లో బిజెపి అభ్యర్థి అరవిందును గెలిపించుకున్నారు, ఆయన సైతం మోసం చేశారని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి మాట నిలబెట్టుకుని తీరుతామని ఆయన భరోసా కల్పించారు. ఇకపోతే ప్రస్తుతం టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాజిరెడ్డి గురించి అంతగా చెప్పాల్సిన అ.వసరం లేదని ఆయన గెలిపించుకుంటే రైతులంతా మామూళ్ళు ఇచ్చుకోవాల్సిందే అని సూచించారు. ఇప్పటికైనా రైతులు గుర్తుంచుకొని 10 ఏళ్లుగా ఈ ప్రాంత రైతాంగాన్ని తాకట్టు పెట్టి రైతులతో ఆడుకుంటున్నారన్నారు. 40 సంవత్సరాలుగా వ్యవసాయమైన రైతాంగమైన జీవన్ రెడ్డికి పూర్తి అనుభవం అవగాహన ఉందని ఒక వ్యవసాయ రైతు కుటుంబానికి చెందిన ఆయన ఎంపీగా గెలిస్తే ఈ ప్రాంత రైతులకు సమన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా నరేంద్ర మోడీని ఓటమి వెంటాడుతుందని తెలుపుతూ రెండు మతాల మధ్య చిచ్చు పెట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక వర్గానికి చెందిన వారి ఆస్తులు లాక్కొని ఇంకో వర్గానికి కట్టబెట్టే సిద్ధాంతం ఏ రాజ్యాంగంలో లేదని ఆయన స్పష్టం చేశారు.

13 సంవత్సరాలుగా, ముఖ్యమంత్రిగా 10 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా ఉన్న మోడీకి ఈ విషయంలో ఏమాత్రం అవగాహన లేదని స్పష్టమవుతుందన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలతో ఇంకెన్ని సంవత్సరాలు దేశ ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవాలని చేసే ప్రయత్నాలు చేయడం తప్పులేదు కానీ మత ప్రాతిపదికన చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని చూడడం దేశానికే ప్రమాదకరమన్నారు. ఈ పరిణామాలతో దేశానికే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. అందుకే బిజెపిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకో ముఖ్య విషయానికొస్తే రాముడు దేవుని పేరు చెప్పుకొని ఓట్లు అడుగుతూ ఉండడం సరికాదని బిజెపి మిత్రులకు గుర్తు చేస్తూ "దేవుడు గుడిలో ఉండాలి - భక్తి గుండెల్లో ఉండాలి" అని హితవు పలికారు. పోలింగ్ బూత్ డబ్బాలలో కాదు అని అన్నారు. మీ స్వార్థ రాజకీయ వ్యాపారం దేశ ప్రజలకు అర్థమవుతలేదు అనుకుంటున్నారా అని గుర్తు చేశారు. ఈ విధమైన ఆలోచన దేశానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. రాముడు మీకే కాదు మాకు కూడా దేవుడే.. మేము సైతం రామున్ని, విష్ణువుని కొలుస్తామని గుర్తు చేశారు. మన సాంప్రదాయంలో భాగమైన దేవుళ్లను ఎవరికి ఇష్టమైన వాళ్ళని వారు పూజించుకునే విధంగా రాజ్యాంగం కల్పించిందన్నారు. ఊర్లలో పీర్ల పండుగ మనం జరుపుకుంటాము, హైదరాబాద్లో జరిగే వినాయక నిమజ్జనంలో ముస్లిం సోదరులు సైతం మతసామరస్యాలకు ప్రత్యేకంగా నిలుస్తారని గుర్తు చేశారు. ఈ పరిస్థితులను రాజకీయాలుగా వాడుకోవడం దేశానికే మంచిది కాదన్నారు. 50 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అధికారం కొత్తేమి కాదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్న బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. కాంగ్రెస్ లో ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని, సోనియా గాంధీ రాహుల్ గాంధీ తమ పదవులను త్యాగం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉన్నదన్నారు. ఇకనుంచి త్యాగాలు చేసే అవసరం లేదని త్యాగాలను పక్కనపెట్టి కొట్లాడుడే ఈ దేశానికి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుడే అని అన్నారు. అందుకే చక్కెర కర్మాగారం తెరిపించడం, పసుపు బోర్డు తేవడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అందుకోసం జీవన్ రెడ్డిని ఎంపీగా గెలిపించి ప్రశ్నించే గొంతుకగా నిలబెట్టాలని రైతులను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన గ్యారెంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తున్న క్రమంలోనే ఎలక్షన్ కోడ్ వచ్చిందని బాసర సరస్వతి సాక్షిగా ఆగస్టు 15 లోగా రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీ చేసి రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత రైతు పండించే పంట 500 రూపాయలు బోనస్ గా ఇచ్చి పంటను కొన్ని బాధ్యత మాదే అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి రోజున దాశరథి మహాకవి నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గడ్డ అని, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ ఈ గడ్డకు చెందిన వారు కావడం గర్వకారణం అన్నారు. ఇంతమంది గొప్ప వ్యక్తులు ఉన్న ఈ గడ్డ నుంచి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యునిగా జీవన్ రెడ్డిని గెలిపించి నిజామాబాద్ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. ఇందుకోసం జీవన్ రెడ్డికి వేసే ఓటు స్వయంగా తనకు వేసినట్టేనని ఈ సందర్భంగా సభాముఖంగా తెలియజేశారు. అంతకుముందు వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలువురు నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అంతా కలిసి ఫ్లవర్ బొకే అందజేసి శాలువా తో సత్కరించారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్, మాజీ ఎంపీ మధు గౌడ్ యాష్కీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, నగర అధ్యక్షుడు కేశవ వేణు, ఏనుగు రవీందర్ రెడ్డి, ఈరవత్రి అనిల్, మాండవ వెంకటేశ్వరరావు, అన్వేష్ రెడ్డి, సునీల్ రెడ్డి, గడుగు గంగాధర్, వినయ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, అరికెల నర్సారెడ్డి, మహేష్ రెడ్డి, ఆకుల లలిత, నరాల రత్నాకర్, రామర్తి గోపి, విపుల్ గౌడ్, వేణు రాజ్, తదితరులు పాల్గొన్నారు.